సాక్షి అనకాపల్లి

గురువారం । 8 । మే । 2025



అపార్ట్‌మెంట్‌లో చిక్కుకున్న వ్యక్తిని తాళ్లతో దించుతున్న సిబ్బంది



రాణిబొమ్మ వద్ద అపార్ట్‌మెంట్‌లో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

న్యూస్‌రీల్

జై జవాన్

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా జాతీయ జెండాలతో ప్రదర్శన



మహిళలతో కలిసి జాతీయ జెండాలతో సైన్యానికి మద్దతు తెలుపుతున్న స్పీకర్

నర్సీపట్నం: కశ్మీర్‌లో పర్యాటకులపై జరిపిన దాడులకు వ్యతిరేకంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మహిళలు జాతీయ జెండాలను పట్టుకుని మద్దతు తెలియజేశారు. మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత రాత్రి ఉగ్రవాదులపై భారత సైన్యం ప్రతీకార దాడులకు మద్దతుగా నిలుస్తున్నట్లు ప్రకటించారు. పర్యాటకులపై జరిగిన దారుణ కాల్పుల్లో 26 మంది అమాయకులు దుర్మరణం పాలైన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. దేశ భద్రత కోసం కేంద్రం తీసుకునే అన్ని చర్యలకు ప్రజలు వెన్నుదన్నుగా ఉండాలన్నారు. కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, ధనిమిరెడ్డి మధు, డబ్బీరు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలల్లో ఉచిత గర్భధారణ ఇంజక్షన్లు



పశు వైద్యులతో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామ్మోహనరావు సమీక్ష

అనకాపల్లి: జిల్లాలోని పశు వైద్యశాలల్లో గర్భధారణ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి.రామ్మోహనరావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. గాంధీనగరంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో వారు జిల్లాలోని పశు వైద్యులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. లింగనిర్ధారణ వీర్యం పశువైద్యశాలల్లో అందుబాటులో ఉందని, 60 శాతం సబ్సిడీతో పాడి రైతులకు అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వేసవి కాలంలో పశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అధిక ఉష్ణోగ్రతల వల్ల వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీ బి.సౌజన్య, పశువైద్యులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



విజయవాడలో పురస్కారం అందుకుంటున్న కశింకోట బాలికల హైస్కూలు విద్యార్థిని గౌరి

కశింకోట: పదో తరగతిలో 579 అత్యధిక మార్కులు సాధించిన స్థానిక బాలికల హైస్కూల్ విద్యార్థిని ఎం.గౌరి సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకున్నవారిలో మేటిగా నిలిచింది. రాష్ట్ర స్థాయిలో టాప్ టెన్‌లో 8వ స్థానంలో నిలవడంతో విజయవాడలో ఆమెకు పురస్కారం అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టాప్ టెన్ విద్యార్థులకు అవార్డు మహోత్సవాన్ని నిర్వహించారు. గౌరికి పురస్కారం లభించడం పట్ల హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, స్కూలు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

రేషన్ కార్డుల్లో చేర్పులు మార్పులకు అవకాశం



జేసీ జాహ్నవి

తుమ్మపాల: రేషన్ కార్డుల్లో చేర్పులు మార్పులకు బుధవారం నుంచి అవకాశం కల్పించినట్టు, అవసరమైన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడ్ సహిత నూతన రేషన్ కార్డుల మంజూరు చేయడంతో పాటు రేషన్ కార్డుల్లో ఏడు సేవల కోసం ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. నూతన బియ్యం కార్డు జారీ, కుటుంబ సభ్యుని చేర్పు లేదా తొలగింపు, బియ్యం కార్డు సరెండర్, చిరునామా మార్పు, తప్పు ఆధార్ సంఖ్య సరిచేయుట వంటి సేవలు పొందవచ్చునని సూచించారు.

సమర సన్నాహం



- మోగిన సైరన్.. దూసుకెళ్లిన యుద్ధ విమానాలు
- బాంబుల మోతలతో జనం బెంబేలు
- రంగంలోకి విపత్తు నిర్వహణ దళాలు
- మాక్ డ్రిల్‌కు సహకరించిన ప్రజలు



విశాఖలో యుద్ధ సైరన్ మోగింది. సరిహద్దుల్లో కమ్ముకున్న యుద్ధ మేఘాలు విశాఖను కమ్మేశాయి. బాంబుల మోత మోగింది.. ఇళ్లల్లో సాధారణ పౌరులు శత్రుసైన్యం చేతికి చిక్కి.. రక్తపు మడుగుల్లో పడిపోయారు. ఓవైపు సమరం సాగుతుండగానే.. మరోవైపు నుంచి విపత్తు నిర్వహణ దళాలు.. రణస్థలికి చేరుకొని.. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. ఎటుచూసినా హాహాకారాలతో విశాఖ నగరం ఉలిక్కిపడేలా.. సమర సన్నాహక మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు.

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో బుధవారం సమర సన్నాహక మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా విశాఖ నగరంలో పలు చోట్ల యుద్ధం జరిగినప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తుతాయి? వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలన్న అంశాలను విశదీకరిస్తూ మాక్ డ్రిల్స్ చేపట్టారు. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలనే అంశాలపై రక్షణ దళాలు ప్రజలను అప్రమత్తం చేశాయి. ఈ మాక్ డ్రిల్‌లో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ఎన్‌సీసీ, ఎన్‌డీఆర్‌ఎఫ్, తూర్పు నౌకాదళం, ఎయిర్‌ఫోర్స్, రైల్వే, విశాఖపట్నం పోర్టు, సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్, వైద్య శాఖ, పలువురు వలంటీర్లు భాగస్వామ్యమయ్యారు.





గాయపడ్డ మహిళను ప్రాథమిక చికిత్సకు తీసుకెళ్తున్న సిబ్బంది



క్షతగాత్రులను తరలిస్తూ..

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో రాణిబొమ్మ సెంటర్‌లో సాయంత్రం రెండు భవనాల్లో ఉగ్రమూకలు పొగ బాంబులతో దాడులు చేశాయి. హుటాహుటిన స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటనాస్థలికి వచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు.. ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను కాపాడి చికిత్స చేశారు. కొందర్ని నిచ్చెన సాయంతో కిందకు దించగా, మరికొందరిని భద్రతా సిబ్బంది మెట్ల మార్గం, తాళ్లు కట్టి తీసుకొచ్చి కాపాడారు. ప్రమాద స్థలానికి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరాలకు తరలించి ప్రథమ చికిత్స అందజేశారు.

క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాల వద్ద ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రత్యేకంగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రమూకల దాడుల కారణంగా తరగతి గదుల్లో చిక్కుకున్న విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎలా రక్షించాలో, వారు ఎలా వ్యవహరించాలో ప్రదర్శనలు ఇస్తూ బలగాలు అప్రమత్తం చేశాయి. వార్ సైరన్ మోగినప్పుడు ఏ విధంగా స్పందించాలి.. సేఫ్ జోన్‌కు ఎలా చేరుకోవాలో చేసి చూపించాయి. రోప్‌ల సాయంతో భవనాలపై నుంచి కిందకు ఎలా దిగాలో చేసి వివరించాయి. ఎస్‌డీఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి, కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు.



ఏయూలో...

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఉదయం మాక్ డ్రిల్ జరిగింది. సీటీఆర్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్ నేతృత్వంలో జరిగిన సన్నాహక చర్యల్లో భాగంగా.. యుద్ధం వస్తే పౌరులను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.. సాధారణ పౌరులు ఎలా వ్యవహరించాలనేదానిపై ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్



ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాల వద్ద పరిస్థితి ఇదీ..



ప్రత్యేక శిబిరంలో వైద్యం అందిస్తున్న సిబ్బంది



మాక్ డ్రిల్‌కు సన్నద్ధమవుతున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

డీఆర్‌ఎం కార్యాలయం వద్ద..



క్షతగాత్రులను దించుతున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ఎంకే సాహూ నేతృత్వంతో సాయంత్రం వాల్తేరు డీఆర్‌ఎం కార్యాలయం వద్ద బ్లాక్ అవుట్ మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ సంక్షోభ సమయంలో రైల్వే సిబ్బంది ఎలా వ్యవహరించాలనే దానిపైనా వాల్తేర్ డివిజన్, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు డ్రిల్ చేపట్టారు. ఎయిర్ రైడ్, పారాలాల్ రోప్ టెక్నిక్, పిక్ ఎ బ్యాగ్, క్యాజువాల్టీ లిఫ్ట్ టెక్నిక్.. ఇలా విభిన్న రకాల డ్రిల్స్ నిర్వహించి.. రైల్వే సిబ్బందితో పాటు ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

ఆక్సిజన్ టవర్స్ వద్ద అప్రమత్తం

సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో బుధవారం రాత్రి సైరన్ మోగించి నివాసితులను అప్రమత్తం చేశారు. అన్ని ఫ్లాట్లు, పరిసరాల్లో లైట్లు ఆపివేశారు. ఫ్లాట్లలో నివసిస్తున్న వారంతా బయటకు వచ్చారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఫ్లాట్లలో నివసిస్తున్న వారిని అప్రమత్తం చేస్తున్నట్టు అపార్టుమెంట్ కమిటీ తెలిపింది. టవర్స్ వద్ద వార్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారని తెలిసి చుట్టుపక్కల ప్రజలు అక్కడి చేరుకున్నారు. అయితే ఈ డ్రిల్ టవర్స్‌లో ఉన్న ప్రజలకు మాత్రమేనని.. బయట ప్రజలకు అనుమతి లేదంటూ పోలీసులు, ఆక్సిజన్ టవర్స్ భద్రతా సిబ్బంది లోపలికి ఎవర్నీ రానీయలేదు. దీంతో సాధారణ పౌరులు ఆగ్రహం వ్యక్తం చేశారు.





లైట్లు ఆపేసి ఇళ్ల నుంచి బయటకు వచ్చేసిన అపార్టుమెంట్‌వాసులు

ప్రతి సచివాలయ పరిధిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తాం..



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొద్ది రోజుల్లో నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. అనుకోని రీతిలో ప్రమాదం వాటిల్లితే ప్రజలు ఎలా స్పందించాలో ముందు నుంచే అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగానే నగరంలో పలు చోట్ల సాధారణ సివిల్ మాక్ డ్రిల్స్‌తో పాటు బ్లాక్ అవుట్ మాక్ డ్రిల్స్ నిర్వహించినట్లు తెలిపారు. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, ఎమర్జెన్సీ సహాయక వాహనాలు, తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, రక్షణ చర్యల్లో వినియోగించే అన్ని రకాల పరికరాలను ప్రదర్శనలో ఉంచామని వివరించారు.

అల్లూరికి ఘన నివాళి



కృష్ణదేవిపేటలో అల్లూరి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, స్థానిక సర్పంచ్ లోచల సుజాత



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని కలెక్టర్ విజయ కృష్ణన్ కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి, అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతికి అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. బ్రిటిష్ వారిపై ఆయన పోరాటం స్వాతంత్ర్య సమర వీరులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. అల్లూరి చరిత్ర స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.ఆర్.సి.సుబ్బలక్ష్మి, సీపీవో బి.రామారావు, డీఎల్‌డీవో మంజులవాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగశిరీష, ఇన్‌చార్జ్ ఏవో వాసునాయుడు, సెక్షన్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి సమాధి వద్ద..

గొలుగొండ: కృష్ణదేవిపేటలోని మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సమాధి వద్ద పలువురు నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాతతోపాటు స్థానికులు సమాధి వద్ద పూలమాలలుంచారు. కృష్ణదేవిపేటలో అల్లూరి విగ్రహానికి స్థానిక సీపీఐ నేతలు నివాళులర్పించారు.

13న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 13న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన వీసీ హాలు, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతాయని వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సంబంధించిన ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

శత్రుదుర్భేద్యంగా విశాఖ

- భారత్ వినియోగిస్తున్న అత్యాధునిక క్షిపణులన్నీ విశాఖలోనే తయారీ
- ఘాజీని డాల్ఫిన్ నోస్ సమీపంలో మట్టి కరిపించిన తూర్పు నౌకాదళం
- ఎన్‌ఏడీ, ఐఎన్‌ఎస్ వర్ష, డేగా బేస్‌ల వద్ద నిరంతర పహారా
- పాక్‌తో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో అప్రమత్తత



సాక్షి, విశాఖపట్నం : భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య రోజు రోజుకూ యుద్ధ వాతావరణం భీకరంగా మారుతున్న నేపథ్యంలో కేంద్రం అన్ని శాఖలకు అలెర్ట్ ప్రకటించింది. ఎప్పుడైనా.. ఎక్కడైనా.. ఏ క్షణంలోనైనా.. అనే నినాదంతో భారత రక్షణ రంగం త్రివిధ దళాల్ని అప్రమత్తం చేసింది. అందుకే విశాఖలోనూ కేటగిరి-2 అలెర్ట్ ప్రకటించారు. భారత నౌకాదళంలో కీలక ప్రాంతంగా వ్యవహరించేలా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోంది. సముద్రజలాల పరిరక్షణ, ప్రపంచ వాణిజ్య కార్యకలాపాలు సాగించే కీలకమైన భద్రతకు అవసరమైన షిప్‌లు, జలాంతర్గాములు, సర్వే వెసెల్స్.. విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళంలో కేంద్రీకృతమయ్యాయి. తూర్పు తీరం వెంబడి 2,562 కి.మీల విస్తీర్ణంలో స్థావరాల్ని ఏర్పాటు చేస్తూ.. తీర పరిరక్షణలో ముఖ్య భూమిక పోషిస్తోంది. దేశంలోని అన్ని సాయుధ దళాల కమాండ్‌లలో భౌగోళిక పరంగా 'ది లార్జెస్ట్ కమాండ్'గా విస్తరించి ఉంది. ఈఎన్‌సీలో ప్రస్తుతం 37,000 మంది సిబ్బంది ఉండగా.. ఇందులో 2,895 మంది అధికారులు, 21,085 మంది నావికులు, 3,695 డీఎస్‌సీ సిబ్బంది, 9,689 మంది రక్షణ పౌరులున్నారు. ఆయుధ సంపత్తిని పెంపొందించుకుంటూ రక్షణ రంగంలో రారాజుగా మారింది. ఇప్పటికే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్‌ఎస్‌టీఎల్), నేవల్ ఆర్మ్‌డ్ డిపో(ఎన్‌ఏడీ)తో పాటు ఎయిర్ స్టేషన్ ఐఎన్‌ఎస్ డేగా.. ఇలా ప్రతి అంశంలోనూ విశాఖ నగరం కేంద్రంగా మారింది.

శక్తివంతమైన క్షిపణులు ఇక్కడి నుంచే..!


భారత నౌకాదళానికి అత్యంత శక్తివంతమైన క్షిపణుల తయారీ కూడా విశాఖ నుంచే జరుగుతున్నాయి. డీఆర్‌డీవో నేతృత్వంలో పనిచేస్తున్న నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీస్(ఎన్‌ఎస్‌టీఎల్) ఆధ్వర్యంలో 50 కిలోమీటర్ల దూరంలోని టార్గెట్‌ని మట్టుబెట్టే వరుణాస్త్ర టార్పెడోకి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. అదేవిధంగా రెండు రోజుల క్రితం అరేబియా సముద్రంలో పాక్‌కు హెచ్చరికలు జారీ చేస్తూ ప్రయోగించిన మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్(ఎంఐజీఎం) కూడా ఇక్కడే తయారైంది. దీంతో పాటు సబ్‌మెరైన్ లాంచ్‌డ్ మిస్సైల్స్, యాంటీ షిప్ మిస్సైల్స్, ఎయిర్‌టూ ఎయిర్, యాంటీ ట్యాంక్, అండర్ వాటర్ వెహికల్స్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ ఇలా.. శత్రుదేశాన్ని గడగడలాడించే ఆయుధ సంపత్తి విశాఖలోనే రూపుదిద్దుకుంది. అందుకే వైజాగ్ అంటేనే పాక్‌కు భయం కలుగుతుంటుంది.

1971 విజయానికి నాంది వైజాగ్

భారత్ పాకిస్తాన్ మధ్య తక్కువ రోజుల్లో అతిపెద్ద యుద్ధం జరిగింది. 1971 డిసెంబర్ 3 సాయంత్రం మొదలైన ఈ యుద్ధం డిసెంబర్ 16న పాకిస్తాన్ ఓటమితో ముగిసింది. బంగ్లాదేశ్ విమోచన అంశం ఈ యుద్ధకాండకు ప్రధాన కారణం. ఇండియన్ నేవీ కరాచీ ఓడరేవుపై చేసిన దాడిలో పాక్‌కు చెందిన యుద్ధ నౌకలు ధ్వంసమయ్యాయి. భారత్ ఎయిర్‌క్రాఫ్ట్ కారియర్ ఐఎన్‌ఎస్ విక్రాంత్‌ను విశాఖలో రంగంలోకి దించారు. విక్రాంత్‌తో పాటు తూర్పు నౌకాదళాన్ని నాశనం చేసేందుకు అత్యంత శక్తిమంతమైన ఘాజీ సబ్‌మెరైన్‌ని పాకిస్తాన్ పంపించగా.. విషయం తెలుసుకున్న భారత్.. ఐఎన్‌ఎస్ రాజ్‌పుత్ సబ్‌మెరైన్‌తో ఘాజీని విశాఖ తీరం సమీపంలోనే డాల్ఫిన్ నోస్ దగ్గరలో సాగరగర్భంలోనే కుప్పకూల్చారు. దీంతో పాక్ నావికాదళంలో 80 శాతం నష్టపోయి.. ఓటమిని అంగీకరించింది. ఈ వేదన పాక్‌ని ఇంకా తొలిచివేస్తోంది. అందుకే దగ్గరలో ఉన్న పశ్చిమ నౌకదాళాన్ని దాటి.. తూర్పు నౌకాదళాన్నే ప్రతిసారీ టార్గెట్ చేస్తూ ఓటమిపాలవుతుంటుంది. ఈసారీ పాక్ మళ్లీ అదే పని చేస్తే జలసమాధి కాకతప్పదు. ఇప్పటికే నగరంలో అప్రమత్తత ప్రకటించి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈఎన్‌సీ నేవల్ బేస్‌తో పాటు ఎన్‌ఏడీ, ఐఎన్‌ఎస్ వర్ష, డేగా బేస్‌ల వద్ద నిరంతర పహారా మరింత పెంచారు.

తిరుగులేని ఆయుధ సంపత్తి

ప్రపంచ రక్షణ దళాల్లో కీలకంగా వ్యవహరించేలా తూర్పు నౌకాదళం ఆయుధ సంపత్తి విషయంలోనూ బలోపేతమవుతోంది. ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ ముంబై, ఐఎన్‌ఎస్ మైసూర్ యుద్ధ నౌకలు విశాఖ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2037 నాటికి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న మరో 20 నుంచి 25 యుద్ధ నౌకలు తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలో చేరనున్నాయి. అదేవిధంగా మల్టీ-రోల్ 60ఆర్ 60ఆర్. అప్‌గ్రేడ్ చేసిన యాంటీ సబ్‌మెరైన్ కమోవ్ 28 హెలికాప్టర్లు, మీడియం లిఫ్ట్ ఇ-295 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా విశాఖలో ఒక్కొక్కటిగా కేంద్రీకృతమవుతున్నాయి. వీటన్నింటితో రాబోయే రోజుల్లో విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళం.. దేశ రక్షణ వ్యవస్థకు పెద్దన్నలా వ్యవహరిస్తోంది.



క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతుడు వెంకట అనిల్

నక్కపల్లి: జాతీయ రహదారిపై వేంపాడు సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ రూరల్ వలస పాకలు గ్రామానికి చెందిన అనుసూరి వెంకట అనిల్(26), పెంకే తేజ మోటారు సైకిల్‌పై విశాఖ వెళ్తుండగా వేంపాడు దాటాక డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో అనిల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అయన్ను తుని ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. తేజ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం


శివ (ఫైల్)

నక్కపల్లి: జాతీయరహదారిపై చినదొడ్డిగల్లు సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. మండపేటకు చెందిన నల్లబారిక శివ(25) చినదొడ్డిగల్లు వద్ద గల మామిడి దుకాణాల వద్ద పనిచేస్తున్నాడు. ఉదయం రోడ్డు దాటుతుండగా నక్కపల్లినుంచి తునివైపు వెళ్తున్న మోటారు సైకిల్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివను తుని ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ తీసుకువెళతుండగా మార్గమధ్యంలో చనిపోయినట్టు కుటుంబసభ్యులు సమాచారం ఇచ్చారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

ఏలేరు కాలువలో పడి ఎలక్ట్రీషియన్ మృతి


లక్ష్మణరావు మృతదేహం

కోటకోట: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి ఏలేరు కాలువలో పడి ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. మండలంలోని బంగారయ్యపేటలో తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట వద్ద ఈ సంఘటన జరిగింది. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బంగారయ్యపేటకు చెందిన ఓయిబోయిన లక్ష్మణరావు (40) సమీపంలోని ఏలేరు కాలువ వద్దకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి మంగళవారం వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలువలో జారి పడి మునిగి గల్లంతయ్యాడు. బుధవారం రామన్నపాలెం వద్ద మృతదేహం బయటపడింది. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.రమణమ్మ సందర్శించి, మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పచ్చని కొండల్లో తుపాకుల మోత

- ప్రశాంతంగా ఉన్న మన్యంలో ఎన్‌కౌంటర్ కలకలం
- ఇద్దరు మావోయిస్టుల మృతితో భయాందోళనలు
- అడవిని జల్లెడ పడుతున్న పోలీసు బలగాలు


వై.రామవరం నుంచి కూంబింగ్‌కు బయలుదేరిన పోలీసు బలగాలు

రంపచోడవరం: అల్లూరి మన్యంలో పోలీసు తుపాకులు గర్జించాయి. పచ్చని కొండలు కాల్పులతో దద్దరిల్లాయి. వై రామవరం మండలం శేషరాయి వద్ద అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన వారిలో మావోయిస్టు పార్టీ అగ్రనేత కాకూరి పండన్న అలియాస్ జగన్ ఉన్నారు. ఏజెన్సీలో మావోయిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు జగన్ ఇటీవల పాతకోట, గుర్తేడు పరిసర ప్రాంతాల్లో పర్యటించి గిరిజనులతో మాట్లాడినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. మావోయిస్టు జగన్ స్పెషల్ జోనల్ కమిటీ మెంబరుగా, పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారు. ఇతనిపై రూ. 20 లక్షల పోలీసు రివార్డు ఉంది. మృతి చెందిన మరో మావోయిస్టు రమేష్ డీసీఎం క్యాడర్‌లో పనిచేస్తున్నారు.

గాలిస్తున్న బలగాలు

ఎదురు కాల్పుల్లో ఇద్దరితోపాటు మరికొందరు మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్న పోలీసు బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి. దండకారణ్యంలో మావోయిస్టులపై అణచివేత ఎక్కువ కావడంతో ఆంధ్రా ఒడిశా బోర్డర్ (ఏవోబీ)ను సేఫ్ జోన్‌గా భావించిన మావోయిస్టుల సంచారం అల్లూరి జిల్లా సరిహద్దులో ఎక్కువైంది. ఈ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ పట్టు కోల్పోవడంతో తిరిగి పార్టీని బలోపేతం చేసేందుకు లోతట్టు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి గిరిజనులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే పోలీసులు గట్టి సమాచార వ్యవస్థతో వారి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం రాబట్టి అప్రమత్తమవుతూ కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. గిరిజన గ్రామాల్లో మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యులను కూడా అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఎన్నో ఏళ్లుగా మారేడుమిల్లిలో నిర్వహిస్తున్న గుర్తేడు పోలీసుస్టేషన్‌ను గుర్తేడులో ఏర్పాటు చేసి అక్కడ నుంచి పోలీసులు తమ కార్యక్రమాలను విస్తృతం చేశారు. దీనిలో భాగంగా ఏవోబీ సరిహద్దు ప్రాంతంలో కూంబింగ్ ముమ్మరం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఎంతో కాలంగా పూర్తికాని కొన్ని కీలకమైన రోడ్లను పూర్తి చేసేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగానే పాతకోట- మంగంపాడు, పోతవరం- వై రామవరం, బొడ్డగండి- డొంకరాయి తదితర రోడ్డు నిర్మాణాలను పూర్తి చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

విద్యార్థి దశ నుంచే ఉద్యమంలోకి...



సీలేరు: కాకూరి పండన్న అలియాస్ జగన్. అలియాస్ అండు.. అలియాస్ బీరును. అలియాస్ బీమ ఇన్ని పేర్లు కలిగిన వ్యక్తి మావోయిస్టు పార్టీలో కీలక నేత. పాఠశాలలో చదువుకుంటున్న తరుణంలో మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై ఉద్యమంలోకి అడుగుపెట్టాడు. 30 ఏళ్ల నుంచి మావోయిస్టు పార్టీలో అంచలంచెలుగా ఎదిగాడు. ఆయనది గూడెం కొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కొమ్ములవాడ. తల్లి పేరు సీతమ్మ. ముగ్గురు సంతానంలో పెద్ద కొడుకు సోమన్న ఇప్పటికే మృతి చెందగా రెండవ కొడుకు కాకూరి పండన్న అలియాస్ జగన్ ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఉంటూ ఎదురు కాల్పుల్లో మృతి చెందాడు. మూడో కొడుకు అప్పన్న ప్రస్తుతం స్వగ్రామం కొమ్ములువాడలో ఉంటున్నారు.

తల్లి వేడుకున్నా..

ఏడాది క్రితం తల్లి సీతమ్మ మృతి చెందింది. ఆమెకు పోలీసులు దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె ఎన్నోసార్లు కొడుకుని చూడాలని.. ఉద్యమాన్ని వీడి రావాలని వేడుకున్నా జగన్ రాలేదు. పోలీస్ శాఖ పలుమార్లు లొంగిపోవాలని, పునరావాసం కల్పిస్తామని ప్రకటన చేసినా ఆయన ఉద్యమం నుంచి బయటకు రాలేదు. ఆయన వయసు 65 సంవత్సరాలు పైబడి ఉంటుందని పోలీసులు గతంలోనే నిర్ధారించారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతాలపై గట్టి పట్టు ఉన్న పండన్న పలుమార్లు పోలీసులకు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నారు. 2021లో తీగల మెట్ట అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో అతను తప్పించుకున్నట్లు పోలీస్ రికార్డులో నమోదయింది. తల్లి మృతి చెందాక.. ఐదు నెలల క్రితం పండన్న తన అనుచరులతో స్వగ్రామమైన కొమ్ములవాడ గ్రామానికి వచ్చి బంధువులు, గ్రామస్తులతో మాట్లాడి భోజనం చేసి వెళ్లాడు. ఇది తెలుసుకున్న పోలీసులు చుట్టుముట్టినప్పటికీ వారి కంట పడకుండా తప్పించుకున్నాడు. అప్పట్నుంచి కాకూరి పండన్నను ఎలాగైనా పట్టుకోవాలని పోలీసులు కంకణం కట్టుకున్నారు. ఈనేపథ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో పండన్న ప్రాణాలు కోల్పోయాడు.

పారిశ్రామికవేత్త అప్పగించిన భూమిలో ఆక్రమణలు

- చిన భీమవరంలో అధికార పార్టీ నేతల నిర్వాకం
- తహసీల్దార్‌కు ఫిర్యాదు.. అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది


హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట: మండలంలోని చిన భీమవరం గ్రామంలో రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. గాజువాకకు చెందిన పారిశ్రామికవేత్త కడియాల రాజేశ్వరరావును నమ్మించి కొంత మంది ప్రభుత్వానికి చెందిన డీ పట్టా భూమిని వేరే సర్వే నంబర్లుతో జిరాయితీ భూమిగా కొనుగోలు చేయించారు. తరువాత అది ప్రభుత్వ భూమి అని తెలుసుకున్న రాజేశ్వరరావు తిరిగి ప్రభుత్వానికే ఇచ్చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి తన వద్ద ఉన్న భూ రికార్డులను అప్పగించారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. డీ పట్టా భూములను అమ్మడం నేరమని, పీవోటీ యాక్ట్ ప్రకారం రాజేశ్వరరావుకు అమ్మిన డీ పట్టాలను రద్దు చేశారు. దీంతో పక్కనే ఉన్న ఆర్ భీమవరానికి చెందిన కొంత మంది అధికార పార్టీ నేతలు.. రాజేశ్వరరావు ప్రభుత్వానికి అప్పగించిన భూముల్లో రాత్రికి రాత్రే పాకలు వేసి భూఆక్రమణలకు పాల్పడ్డారు. దీనిపై గ్రామస్తులు తహసీల్దార్ లక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాలతో వీఆర్వో తులసీ, వీఆర్ఏలు మట్టా అప్పారావు, వెంకటేష్ ప్రభుత్వ భూమిలో పాకలు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

సీపెట్ డిప్లొమా కోర్సుల దరఖాస్తుకు గడువు ఈనెల 29

అనకాపల్లి: విజయవాడలోని సీపెట్(సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ)లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 29వ తేదీతో ముగియనుంది. పదో తరగతి ఉత్తీర్ణతతో 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్థులకు 2 సంవత్సరాల వ్యవధి గల పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ 3 కోర్సులను అందిస్తున్నట్లు విజయవాడ సీపెట్ డైరెక్టర్ సీహెచ్.శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతి, అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. జూన్ 8న విజయవాడ, అనంతపురం కేంద్రాల్లో రాత పరీక్ష జరుగుతుందన్నారు. వివరాలకు 93985 35697 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్


సమావేశంలో చోరీ సొత్తు చూపిస్తూ దొంగల ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు. ఈ మేరకు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనకాపల్లి మండలం, పట్టణంలో ఈ నెల 1న జరిగిన వరుస మూడు దొంగతనాలపై అందిన ఫిర్యాదు మేరకు ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్ నేతృత్వంలో టీమ్‌లు ఆధునిక సాంకేతికత సహాయంతో దొంగలను బుధవారం మారేడిపూడి జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్నారన్నారు. తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు(24), ఉప్పల సురేష్(30), కందివలస నరసింహారావు(39), జనార్దన్(30), కంకణాల సుభాష్(19) పాత కేసుల్లో జైలులో ఉన్నప్పుడు పరిచయాలు పెంచుకొని ఐదుగురు ముఠాగా ఏర్పడ్డారని తెలిపారు. వీరంతా గుంటూరు జిల్లాకు చెందిన వారని, ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తూ డబ్బు అవసరమైనప్పుడు దొంగతనాలకు పాల్పడుతుంటారని ఆమె వివరించారు. నిందితులను విచారించగా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్టు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి మూడు దొంగతనాలకు సంబంధించి తులం పావు బంగారం ఆభరణాలు, రూ.1.05 లక్షల నగదు, యాపిల్ ఐఫోన్, రెండు కేజీల వెండి వస్తువులు, ల్యాప్‌టాప్, కారు తాళాలు, పట్టుచీరల బ్యాగ్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. హైదరాబాద్‌కు సంబంధించిన పలు దొంగతనాలలో ఐదు గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి స్వాధీనం చేసుకోగా, రూ.1.30 లక్షలు జల్సాలకు విజయవాడలో ఖర్చు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

రెండో బిడ్డను చూడకుండానే అనంత లోకాలకు..

- ఎల్‌బీ పురం పామాయిల్ ఫ్యాక్టరీలో విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి
- పరిహారం కోసం మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన
- రూ.28 లక్షలు, ప్రతి నెలా జీతం చెల్లింపునకు యాజమాన్యం అంగీకారం


పల్లా అప్పన్న (ఫైల్)

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్‌బీ పురం పామాయిల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుడు పల్లా అప్పన్న(30) విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. అప్పన్న ఎప్పటిలాగే బుధవారం తోటి కార్మికులతో కలిసి ఫ్యాక్టరీలో విధులకు వచ్చాడు. మధ్యాహ్నం భోజన సమయంలో ఫ్యాక్టరీలో ఉన్న తాటిచెట్టు కాయలను గొల్ల కత్తితో కోస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు కత్తి తగిలింది. పామాయిల్ గెలలు కోసే పొడవాటి ఇనుప కత్తి కావడంతో అప్పన్న విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఫ్యాక్టరీ సిబ్బంది వెంటనే ఆయన్ను వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి చోడవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. దీంతో అప్పన్న మృతదేహాన్ని తిరిగి పామాయిల్ ఫ్యాక్టరీ తీసుకొచ్చి యాజమాన్యం తమను ఆదుకోవాలంటూ అప్పన్న కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. రాత్రి వరకు బాధిత కుటుంబ సభ్యులు ఫ్యాక్టరీలోనే అప్పన్న మృతదేహంతో ఆందోళన చేశారు. రూ.25 లక్షల పరిహారం, మరో 30 ఏళ్ల పాటు మృతుడి కుటుంబానికి జీతం అందిస్తామని యాజమాన్యం తెలపగా.. బాధిత కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. ఫ్యాక్టరీ యజమాని విజయ్‌మిట్టల్ వచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని, కోటి రూపాయలు అందించాలని ఆందోళనకు దిగి నినాదాలు చేశారు. చివరకు రూ.28 లక్షలు పరిహారం, 30 ఏళ్ల పాటు ప్రతి నెలా కంపెనీ నుంచి జీతం చెల్లించేందుకు, ఇన్సూరెన్స్, ఇతర అలవెన్స్ వచ్చేలా చేస్తామని యాజమాన్యం అంగీకరించడంతో ఆందోళన విరమించారు.


ఫ్యాక్టరీలో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, కార్మిక సంఘ నాయకులు

మృతుని భార్య 8వ నెల గర్భిణి

మృతుడు భార్య రేవతి 8వ నెల గర్భిణి. వీరికి పెళ్లై రెండేళ్లు కాగా.. ఏడాదిన్నర బాబు ఉన్నాడు. మంగళవారం అప్పన్న తన భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించాడు. కొద్ది రోజుల్లో భార్య రెండో బిడ్డకు జన్మనిస్తుందన్న సంతోషంలో ఉన్నాడు. కానీ ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. విద్యుత్ రూపంలో అప్పన్న మృతి చెందడంతో రేవతి కన్నీరుమున్నీరుగా విలపించింది. తనకు, తన బిడ్డలకు దిక్కెవరంటూ రోదించింది. మృతుని తండ్రి గతంలోనే మృతి చెందగా.. భార్య, తల్లి ఆయనపై ఆధారపడి జీవిస్తున్నారు. చోడవరం సీఐ అప్పలరాజు, అదనపు ఎస్ఐ భాస్కరరావు వచ్చి యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు


సబ్సిడీపై నవధాన్యాల విత్తనాలు అందుకున్న రైతులు

చోడవరం: ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతంగా తయారవ్వడంతో పాటు రైతులకు మంచి పంట దిగుబడి వస్తుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న తెలిపారు. మండలంలో చాకిపల్లి గ్రామంలో సర్పంచ్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతున్న సమయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా వివరించారు. పంటకు కావలసిన సూక్ష్మ, స్థూల పోషకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. నవధాన్యాలు సాగుచేయడం వల్ల పశువులకు మంచిన పోషకాహారం కూడా లభిస్తుందన్నారు. నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయని, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. తొలకరి వర్షాలకు ముందే ప్రకృతి వ్యవసాయం విధానంలో భూమిని సంరక్షిస్తే ఏడాదంతా పంటకు మేలు చేస్తుందని సూచించారు. మిశ్రమ పంటలు వేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని, ప్రధానంగా రసాయన ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై అపరాలు, నవధాన్యాల విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లూమ్ జిల్లా ఇన్‌చార్జి గోవిందరావు, ఎస్ఎఫ్ఏ నాగమణి, నాయుడుబాబు, కాండ్రేగుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

అనకాపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు వ్యతిరేకంగా ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఒక రోజు సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని, కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండా చేశారని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్ కి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకం వేతనదారులకు 200 రోజుల పాటు పనికల్పించి, రోజుకు రూ.600 చొప్పున కూలి చెల్లించాలని. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, భవన నిర్మాణ, ఆటో, ముఠా కార్మికులకు సమగ్ర చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ


దొంగతనానికి పాల్పడిన నిందితుల సీసీ టీవీ ఫుటేజీ

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటకు చెందిన మహిళ మెడలో మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. గ్రామానికి చెందిన ఐయితరెడ్డి లక్ష్మి బుధవారం చెరుకు కాటా వద్ద గల తన పాన్‌షాపు వద్ద ఉండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు లక్ష్మి మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితురాలు బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుచ్చెయ్యపేట ఎస్ఐ సెలవులో ఉండటంతో రావికమతం ఎస్ఐ వర్మ, బుచ్చెయ్యపేట అదనపు ఎస్ఐ భాస్కరరావు కాటా దగ్గరలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను సేకరించి విచారణ చేస్తున్నారు. నంబర్ ప్లేటు లేని స్కూటీపై వచ్చిన వ్యక్తులు ముఖానికి మాస్కులు ధరించి ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

విప్లవ జ్యోతి అల్లూరికి ఘన నివాళి


అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీలు దేవప్రసాద్, మోహన్‌రావు

అనకాపల్లి: విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన అల్లూరి బ్రిటిష్ సైన్యాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడి, వారికి చైతన్యం కలిగించిన మహానుభావుడు అల్లూరి అని కొనియాడారు. 1924 మే 7న బ్రిటిష్ తుపాకులకు బలైపోయినా, ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి చిరస్థాయిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మోహనరావు, సీఐలు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, తమలంపూడి లక్ష్మి, రమేష్, గఫూర్, ఎస్ఐ ప్రసాద్, శిరీష, అంజిబాబు, విశ్వనాథం, మదీనా వల్లి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల గ్రామం కొత్తపేటలో అదే వీధికి చెందిన చిన్నాల చిట్టిబాబు అక్రమంగా మద్యం తరలిస్తుండటంతో అరెస్ట్ చేసినట్లు పట్టణ క్రైం ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు తెలిపారు. నిందితుడు నుంచి 10 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తరణకు ప్రణాళికలు



శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్: జిల్లా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు మార్కెటింగ్ చేసే వారికి జిల్లా ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ లచ్చన్న ఆధ్వర్యలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు మేరకు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం వివిధ గ్రామాల్లో విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ గోవింద్, జిల్లా మార్కెటింగ్ అధికారి వర్మ, మార్కెటింగ్ ట్రైనర్ అప్పలరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 31 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణుడు జాక్సన్

కశింకోట: సాయిరాజా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సహకారంతో బుధవారం తాళ్లపాలెంలో రామాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి ఆస్పత్రి వైద్య నిపుణుడు జాక్సన్ 56 మంది రోగులను పరీక్షించి 31 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ప్రత్యేక వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించనున్నట్లు సాయిరాజా వెల్ఫేర్ ట్రస్టు నిర్వాహకుడు పూసర్ల రాజా తెలిపారు. వీరికి శస్త్ర చికిత్సలు అనంతరం పరీక్షలను తాళ్లపాలెంలోని తమ ట్రస్టు కంటి ఆస్పత్రిలో నిర్వహించి సేవలందిస్తామన్నారు. బీజేపీ నాయకుడు గళ్లా రాజు, శిబిరం ఇన్‌చార్జి అశోక్‌కుమార్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సులపై అవగాహన

సింహాచలం: నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, ఇనిస్టిట్యూట్‌లో పారామెడికల్ కోర్సులపై ఉచిత అవగాహన కల్పిస్తున్నట్టు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు తెలిపారు. పన్నెండవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9121005933 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 305 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,210	4.900
రెండో రకం	3,800	4,310
మూడో రకం	3,550	3,740

అనకాపల్లి సినిమాలు

రాజా : రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : థండర్ బోల్ట్స్
పర్తిసాయి : హిట్-3
షిర్డీసాయి : ఓదెల 2
వెంకటేశ్వర : జింఖానా
శ్రీసత్య : సారంగపాణి జాతకం
రామచంద్ర : తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–14 యూనిట్లు, బీ పాజిటివ్–6, ఓ పాజిటివ్–13, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.



గోతులతో నిండి ఉన్న ఉగ్గినపాలెం రోడ్డు

సగ భాగం మేర దెబ్బతిన్న ఉగ్గినపాలెం రోడ్డు

ఈ రోడ్డుపై ప్రయాణమెలా..

- దారుణంగా దెబ్బతిన్న ఉగ్గినపాలెం రోడ్డు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ హయాంలో నిధులు మంజూరైనా కూటమి పాలకులు పట్టించుకోవడం లేదు. పర్యవసానంగా గతుకులు పడి రాకపోకలకు నరకయాతన అనుభవించాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రోడ్డు అతీగతీ గురించి పట్టించుకోలేదని వాపోతున్నారు.

అనకాపల్లి–యలమంచిలి మార్గంలో ఉగ్గినపాలెం గ్రామ పంచాయతీ ఉంది. జాతీయ రహదారి నుంచి లోపల ఉన్న గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. మూడు వేల మంది జనాభా కలిగి ఉంది. ఎక్కువ మంది రైతులు, కూలీలు ఉన్నారు. వీరు జీవనోపాధి కోసం, వ్యవసాయ సాగుకు ఎరువులు, ఇతర సామగ్రి కోసం నిత్యం అటు అనకాపల్లి, కశింకోట, మరో వైపు యలమంచిలి, తాళ్లపాలెం వైపు రాకపోకలు సాగిస్తుంటారు. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం మట్టిరోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఆ తర్వాత అది దెబ్బతినడంతో దానిపై తారు రోడ్డు నిర్మించారు. అది దాదాపు దశాబ్దంన్నర క్రితం దెబ్బతింది. గోతులు పడి అధ్వానంగా మారింది. అప్పటి నుంచి దీని మరమ్మతుల గురించి ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది చెందుతున్నారు. వర్షం పడితే గోతుల్లో నీరు నిలిచిపోయి గతుకులు కానక వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలున్నాయి. వాహనాలు పాడైపోతున్నాయని ద్విచక్ర వాహనదారుల, ఆటో కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో నిధుల మంజూరు

ఈ రోడ్డు పునర్నిర్మాణానికి గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో రూ.55 లక్షలు మంజూరు చేశారు. టెండర్లు పిలిచారు. అయితే ఎవరూ ముందుకు రాకపోవడం, సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో రోడ్డు నిర్మాణం పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తీరుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇక్కడ మాత్రం రోడ్డు అధ్వానంగా ఉన్నప్పటికి దాని అతీగతీ గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో తమ జీవనోపాధికి నిత్య కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి, అత్యవసర సమయంలో వైద్య సేవలు పొందడానికి వెళ్లడానికి నానా యాతన పడాల్సి వస్తోందని నిట్టూరుస్తున్నారు. తమ బాధలను గుర్తించి ఇప్పటికైనా గతుకుల రోడ్డుకు మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

రోడ్డు బాగోక వలసపోయాం



మా గ్రామానికి వెళ్లే రోడ్డు గతుకులతో దారుణంగా ఉంది. రాకపోకలు సాగించాలంటే ఏ సమయంలో ఎటువంటి ప్రమాదానికి గురికావలసి వస్తుందోనని ఆందోళనగా ఉంది. ఇక్కడ బాగోక రాకపోకలకు అనువుగా లేని పరిస్థితిలో మా పిల్లలను చదివించడానికి కశింకోటకు వలస వెళ్లిపోవలసి వచ్చింది. వృత్తి రీత్యా వైద్య సేవలందించడానికి మాత్రం నిత్యం రావలసి వస్తోంది. 15 ఏళ్లుగా రోడ్డు దెబ్బతిని ఉన్నప్పటికి ఏ ప్రభుత్వమూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఇప్పటికైనా రోడ్డును తక్షణమే పునర్నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాజోలు సుబ్రహ్మణ్యం, ఉగ్గినపాలెం

రోడ్డు పునర్నిర్మించాలి



ఏళ్ల తరబడి ఉగ్గినపాలెం రోడ్డు గోతులతో నిండి భయంకరంగా ఉన్నా, అటు ప్రభుత్వం గాని, ఇటు అధికారులు గాని పట్టనట్టు వ్యవహరించడం శోచనీయం. దీనివల్ల రోడ్డుపై రాకపోకలకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. నేను హైదరాబాద్‌లో ఉంటూ తరచుగా మా గ్రామానికి వస్తుంటాను. ఎప్పుడు ఎటువంటి ప్రమాదానికి గురి కావలసి వస్తుందోనని భయమేస్తోంది. సత్వరమే అధికారులు రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– మట్టం రవి, ఉగ్గినపాలెం

నిధుల కోసం ప్రతిపాదన

ఉగ్గినపాలెం రోడ్డు పంచాయతీరాజ్ ప్రాజెక్టు విభాగం ద్వారా పునర్నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించారు. నిధులు మంజూరు కావలసి ఉంది. నిధులు మంజూరైన తర్వాత పనులు చేపట్టడానికి చర్యలు చేపడతారు.

–వేణుగోపాలరావు, డీఈ, పంచాయతీరాజ్, అనకాపల్లి

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి



డీఈవో అప్పారావు నాయుడుకు వినతి ప్రతం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనకాపల్లి: పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాక డీఈవో కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఏ మాత్రం లెక్కచేయకుండా సెలవు దినాల్లోనూ జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను నడుపుతూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూళ్లు చేస్తున్నారన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

పశు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించండి



డెయిరీ ఫాం రైతుతో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామ్మోహనరావు

కశింకోట: పాడి రైతుల కోసం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాల గురించి సమగ్రంగా అవగాహన కలిగించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. రామ్మోహనరావు సూచించారు. స్థానిక పశు వైద్యశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విశాఖ డివిజనల్ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి ఆల్ఫాన్సా జార్జికి పలు సూచనలు చేశారు. లాభదాయకమైన పశుగ్రాస సాగు, సెక్స్ సార్టెడ్ సెమెన్ దూడల ఉత్పత్తి తదితర అంశాల గురించి రైతులకు అవగాహన కలిగించాలన్నారు. అనంతరం స్థానిక శారదా నది ఆవల ఆళ్ల శివకుమార్‌కు చెందిన డెయిరీ ఫాంను సందర్శించారు. అక్కడ పశుగ్రాస సాగు, సెక్స్ సార్టెడ్ సెమెన్ దూడలను తనిఖీ చేశారు.

చిన్నారులకు నృత్య శిక్షణ



బాలలకు భరత నాట్యంలో శిక్షణ



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు భరత నాట్యం, యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఏడో రోజు బుధవారం వీటిని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పుస్తక పఠనం చేశారు. గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

సీహెచ్‌వోలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి



మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ వద్ద సీహెచ్‌వోలకు సంఘీభావం తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి: జిల్లాల్లో వివిధ పీహెచ్‌సీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు(సీహెచ్‌వోలు) సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ విమర్శించారు. స్థానిక ఎస్‌బీఐ ఎదురుగా తొమ్మిదో రోజు బుధవారం కమ్యూనిటీ హెల్త్ అధికారులు దీక్షలు కొనసాగాయి. ఈ శిబిరానికి విచ్చేసి ఆయన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 9 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ఎంతో ఉన్నతమైన వైద్య విద్యనభ్యసించి అరకొర జీతాలతో ఆర్థిక సమస్యలతో ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్‌వో పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణను వ్యతిరేకిస్తూ 12న ధర్నా



మాట్లాడుతున్న సుర్ల మురళీమోహన్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరు రకాల పాఠశాలలుగా విభజిస్తే, కూటమి ప్రభుత్వం వాటిని తొమ్మిదిగా విభజించి విద్యార్థులను గందరగోళ పరిస్థితుల్లోకినెట్టి వేస్తుందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శులు సుర్ల మురళిమోహన్, కిశోర్, డి.రాములు విమర్శించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూటీఎఫ్ ఒక రోజు శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యను ప్రయోగశాలగా మార్చొద్దని కోరుతున్నామన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో అసంబద్ధాలను వ్యతిరేకిస్తూ ఈ నెల12న జిల్లా స్థాయి ధర్నా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు జీవో నంబరు 117ను రద్దు చేశామని చెబుతున్నా, అందులో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని కొనసాగించడం తగదన్నారు. హైస్కూళ్లలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:40గా, ప్రాథమిక పాఠశాలలో 1:20 గా ఉండాలని, యూపీ పాఠశాలలను ఎత్తి వేయడం వల్ల గ్రామీణ విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీగా మార్చాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ కమీషన్ వేసి, 30% మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యుటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, గౌరవాధ్యక్షుడు పంపనబోయిన వెంకట్రావు, సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు గుత్తుల సూర్యప్రకాష్, పొలిమేర చంద్రరావు, శేషుకుమార్, మాకిరెడ్డి రాజునాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వి. అప్పారావు వివిధ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గ్రామీణ స్థాయి కమిటీలు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు నియోజకవర్గంలో గ్రామ, పట్టణ స్థాయి కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ శ్రేణులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజల్లో విరక్తి కలిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏడాదిలో వివిధ రూపాల్లో బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందాయన్నారు. గ్రామీణ ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడిందన్నారు. సూపర్ సిక్స్ పథకంలో ఏడాది అవుతున్న ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. ప్రజలు పక్షాన కూటమి ప్రభుత్వంపై దశలు వారిగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 83వ వార్డు ఇన్‌ఛార్జ్ జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, కోరుకొండ రాఘవ, బొడ్డేడ లక్ష్మినరసింహ, మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి



రైల్వే స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు



గూడ్స్ రోడ్ వద్ద అల్లూరికి నివాళులర్పింస్తున్న బీజేపీ నాయకులు



అల్లూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలు కోసం పోరాడాలన్నారు. బ్రిటిష్ పాలనలో గిరిజనులపై దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు అల్లూరి అని కొనియాడారు. టీడీపీ ఆధ్వర్యలో రైల్వే స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, 82వ వార్డు ఇన్‌చార్జి పోలారపు త్రినాథ్ పెనుమత్స కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. గూడ్స్ రోడ్ వద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వి. నర్సింగ్ యాదవ్ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉడా రమేష్, సీనియర్ నాయకుడు కొణతాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు లక్ష మల్లెల పూజ



అమ్మవారి ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు



అమ్మవారి ఉత్సవ విగ్రహానికి బియ్యంతో అభిషేకాలు చేస్తున్న భక్తులు



కన్యకాపరమేశ్వరికి లక్ష మల్లెలతో పూజ

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి (వాసవీమాత) ఆలయం ఆవరణలో అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వందేళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయాన్ని పట్టణంలో 1925లో స్థాపించారు. ఈ నేపథ్యంలో వైశాఖ మాస శుద్ధ దశమిన అమ్మవారి జయంతి వేడుకలు ఏటా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. తెల్లవారుజామున అమ్మవారి నామ భజన సంకీర్తన, మేళ తాళాలతో పట్టణ పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. అనంతరం నిత్యప్రార్థనలు, గోపూజ, నగరేశ్వర స్వామి జనార్దన్ స్వామి వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులతో బియ్యాభిషేకం, అమ్మవారికి లక్ష మల్లెపూలతో అర్చన, సామూహిక లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, ఆలయం చుట్టూ వెండి రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహంతో 102 రకాల మిఠాయిలతో ప్రదర్శన, రాత్రికి ఊంజల్ సేవ, కోలాటాలు వంటి అనేక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో దుర్గంధం



ఏలేరు కాలువలో చెత్తా చెదారం,గుర్రపు డెక్కలు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ బొజ్జన్న కొండకు వెళ్లే రహదారిలోని ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఏలేరు కాలువ దుర్గంధ భరితంగా మారింది. ఇందులో చెత్తా చెదారం, గుర్రపు డెక్క పేరుకు పోయి దుర్వాసన వెలువడటంతో అటుగా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు సత్యనారాయణ, అప్పారావు, సురేష్ వాపోయారు. నిత్యం వేలాది మంది వాకర్స్ ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రహదారి మీదుగా వాకింగ్ చేస్తున్నారని, నాలుగు నెలలుగా దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ, జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని కాలువలో చెత్తా చెదారం తొలగించాలని కోరుతున్నారు.

సూపర్ సిక్స్ అమలులో విఫలం

అనకాపల్లి: కూటమి అధికారం చేపట్టి ఏడాది అవుతున్నప్పటికీ బడుగు, బలహీన వర్గాలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైనట్లు సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వియ్యపు రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఏడాది పాటు నిరుద్యోగ భృతి లేకుండా పోయిందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. బీసీ మహిళలకు కుట్టు మిషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: తుమ్మపాల విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 9న వైర్లు మరమ్మతులు నిమిత్తం సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ ఏఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మపాల, అల్లిఖనుదువానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.